

గ్రంథాలయంలో తనిఖీ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణంలోని శాఖా గ్రంథాలయాన్ని గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బారత్తమ్మ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు.



ప్రసన్నాంజనేయుని మాలధారణ

బెల్లంకొండ: బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద గల కోళ్లూరు ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో కార్తిక మాసం సందర్భంగా శనివారం భక్తులు మాలధారణ చేపట్టారు.



బిక్ష ప్రారంభం

చిలకలూరిపేట: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని సుభానీనగర్‌లో ఉన్న హరిహరసుత అయ్యప్పస్వామి దేవస్థానంలో శనివారం బిక్ష కార్యక్రమం ప్రారంభించారు.

న్యూస్‌రీల్

డిసెంబర్ 14న మెగా లోక్‌అదాలత్



రేపల్లె రూరల్: కక్షిదారుల సమయం, ధనం వృథా కాకుండా రాజీపడదగిన కేసులను పరిష్కరించేందుకే డిసెంబర్ 14న మెగా లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి టీ.వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక సబ్‌కోర్టు హాలులో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లోక్‌అదాలత్‌లో సివిల్, క్రిమినల్, ప్రీలిటికేషన్ కేసులను పరిష్కరిస్తారని పేర్కొన్నారు. సమావేశంలో వివిధ బ్యాంకల ప్రతినిధులు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సిబ్బంది, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపు వద్దు



వేటపాలెం: నివాసాల మధ్య మద్యం షాపు వద్దంటూ మహిళలు శనివారం అడ్డుకున్నారు. స్థానిక సంతారావూరు రోడ్డు, చీరాల–వేటపాలెం రోడ్డులో సెంటర్‌కి దగ్గరలో నివాస గృహాల మధ్య ఏర్పాటు చేయ తలపెట్టిన మద్యం షాపు ఏర్పాటు చేయవద్దని స్థానిక మహిళలు ధర్నా నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. షాపు ఏర్పాటు చేయతలపెట్టిన యజమానులకు.. ఆందోళనకారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న ఎస్సై సంఘటనా స్థలానికి వచ్చి ఆందోళనకారులకు సర్ది చెప్పి విరమింపజేశారు.

అమరేశ్వరాలయంలో కార్తిక సందడి

అమరావతి: అమరావతి క్షేత్రంలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో శనివారం కార్తికమాసం ప్రారంభం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునుంచే అమరేశ్వరాలయంలో భక్తుల సందడి నెలకొంది. భక్తులు పవిత్ర కృష్ణానదిలో కార్తిక స్నానాలు చేసి ఆలయంలో కార్తిక దీపాలు వెలిగించి కార్తిక దామోదరునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరీ అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు ఇబ్బందిపడకుండా క్యూలైన్‌లు ఏర్పాటుచేశారు. తాగునీరు, ఉచిత అన్నదానం, ప్రసాదం అందజేశారు. గతేడాది లాగానే గ్రామంలో, ఆలయంలో, స్నానఘాట్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుశాఖ బందోబస్తు నిర్వహిస్తుంది. అమరావతి ప్రధానవీధిలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద భక్తులకు విద్యుత్ వెలుగులతో స్వాగత తోరణాలతోపాటు రోడ్డు కిరువైపులా విద్యుత్ తోరణాలను ఏర్పాటు చేసి దేవాలయానికి రాజగోపురానికి విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేయటంతో ఆలయంగా శోభాయమానంగా ఉంది.

గుండ్లకమ్మలో దూకి విద్యార్థి ఆత్మహత్య?

మృతదేహం కోసం గాలింపు



అద్దంకి రూరల్: గుండ్లకమ్మ నదిలో దూకి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం సాయంత్రం అద్దంకిలో చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న సీఐ కృష్ణయ్య.. ఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. అద్దంకిలోని గరటయ్య కాలనీ 19వ లైన్‌లో నివాసం ఉంటున్న దాట్ల శ్రీను కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శ్రీనుకు ఇద్దరు కుమారులు కాగా.. చిన్నవాడైన దాట్ల దుర్గాప్రసాద్ (18) స్థానిక విశ్వభారతి కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం దుర్గాప్రసాద్ తన అన్నతో.. తనకు తిమ్మాయపాలెంలో ఉన్న స్నేహితుడు డబ్బు లు ఇస్తానన్నాడని.. తీసుకుని వస్తాను తోడురమ్మని అన్నతోపాటు బైకుపై తిమ్మాయపాలెంలో బయలుదేరాడు. మార్గంమధ్యలోని గుండ్లకమ్మ నది మీద ఉన్న బ్రిడ్జి వద్దకు రాగానే డబ్బులు కింద పడ్డాయి అని చెప్పి.. అన్నను బైకు ఆపమన్నాడు. బైకు ఆపగానే అకస్మాత్తు గా పరుగెత్తుకుంటూ వెళ్లి బ్రిడ్జిపై నుంచి నదిలో దూకాడు. అతని అన్న కేకలు వేయటంతో స్థానికులు వచ్చి చూడగా నదిలో కొట్టుకుపోతూ కొంత సేపు కనిపించి ఆ తరువాత మాయమయ్యాడు. సంఘటనా స్థలానికి చేరకున్న ఎస్సై, సీఐలు, ఫైర్ సిబ్బంది గజ ఈతగాళ్లతో గాలిస్తున్నారు. మృతదేహం ఇంకా దొరకలేదు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.




బాధితులను పరామర్శిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకట మురళి




సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ వెంకట మురళి, ఆర్డీవో రామలక్ష్మి

బాధితులకు పరామర్శ

నిజాంపట్నం మండలం గోకర్ణమఠం గ్రామంలోని రాయల్ మెరైన్ సీ ఫుడ్ యూనిట్‌లో శనివారం చోటుచేసుకున్న ప్రమాదంలో పెద్ద సంఖ్యలో కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. యాసిడ్ పెద్ద మొత్తంలో కిందపడిపోవటంతో కంపెనీ సిబ్బంది దానిపై నీరు చల్లారు. ఒక్కసారిగా ఫ్యాక్టరీలో పొగలు కమ్ముకున్నాయి. ఘాటుకు పలువురు అస్వస్థతకు గురై కొంత మంది అపస్మారక స్థితికి చేరుకున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న 80మందిని నిజాంపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, మరో 20 మందిని పిట్టలవానిపాలెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నిజాంపట్నం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారిలో 30 మంది పరిస్థితి ఇబ్బందికరంగా ఉండడంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలాన్ని జిల్లా కలెక్టర్ వెంకట మురళి పరిశీలించి ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీనిచ్చారు. ప్రమాదానికిగల కారణాలను పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామన్నారు. -నిజాంపట్నం

ఆగని ఇసుక అక్రమ రవాణా

- నిత్యం వెయ్యికిపైగా ట్రాక్టర్లలో తరలింపు
- మొక్కుబడిగా అధికారుల దాడులు
- ముందుగానే అక్రమార్కులకు సమాచారం
- అంతా సర్దుకుంటున్న ఇసుకాసురులు
- కలెక్టర్ వెంకట మురళి సీరియస్
- ఉత్సవ విగ్రహాలుగా మండల కమిటీలు



ఇసుక యథేచ్ఛగా తవ్వడంతో ఏర్పడిన గుంతలు

చీరాల: సీఎం చంద్రబాబు ఇసుక పాలసీలో చెప్పేదొకటైతే...తమ్ముళ్లు మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ అంతా దోచుకుపోతున్నారు. చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల పరిధిలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతోంది. దీన్ని నియంత్రించాల్సిన అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. సీఎం చంద్రబాబు చెప్పారంటూ ఇసుక అక్రమ రవాణా, తవ్వకాలు రోజుకు వెయ్యి ట్రాక్టర్లకు పైగా జరుగుతోంది. కలెక్టర్ వెంకట మురళి ఏర్పాటు చేసిన మండల లెవల్ కమిటీలు నామమాత్రపు చర్యలు కూడా చేపట్టడంలేదు. కూటమి నేతలు అందులో భాగస్వాములు కావడమే దీనికి కారణమని ప్రజలు విమర్శిస్తున్నారు. దీంతో సీఎం చంద్రబాబు మాటలకు అర్థాలే వేరులే అన్నట్లు ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు.

మొక్కుబడిగా తనిఖీలు

చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల పరిధిలో 216 జాతీయ రహదారి వెంట నిత్యం వెయ్యి ట్రాక్టర్లకు పైగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. ఇది ప్రజలందరికీ కనిపిస్తున్నా సంబంధిత అధికారులకు మాత్రం వారిపై చర్యలకు ఉపక్రమించడంలేదు. మీడియాలో కథనాలు, ఎవరైనా ఫిర్యాదు చేసినప్పుడు మాత్రమే అధికారులు మొక్కుబడిగానే తనిఖీలు చేస్తూ మమ అనిపిస్తున్నారు. మైనింగ్ అధికారులు సిబ్బంది కొరత పేరుతో పూర్తిస్థాయి చర్యలు చేపట్టలేకపోతున్నామని సాకులు వెదుకుతున్నారు. రెవెన్యూ, పోలీస్ క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలను పట్టించుకోవడం లేదు. ఇదిలా ఉంటే ఉన్నతాధికారులు తనిఖీలకు వస్తున్న విషయం ముందుగానే అక్రమార్కులకు చేరుతోంది. దీంతో అధికారులు వచ్చిన సమయంలో మాత్రం ఇసుక తవ్వకాలు ఆపుతున్నారు. ఇది అధికారుల అండ లేకుండా జరిగే పని కాదనేది బహిరంగ రహస్యం. అధికార పార్టీతోపాటు మరికొంత మంది కూడా ఈ అక్రమ దందా సాగిస్తున్నారు. తిలా పాపం తలా పిడికెడు అన్నట్లు పరిస్థితి మారింది.

అసైన్డ్ భూముల్లో తవ్వకాలు

వేటపాలెం రైల్వేబ్రిడ్జి పక్కన రైల్వే ట్రాక్ వెంబడి అసైన్డ్ భూముల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. కలెక్టర్ వెంకట మురళికి ఫిర్యాదులు రావడంతో ఆయన ఆదేశాల మేరకు రెవెన్యూ, మైనింగ్ అధికారులు దాడులు చేపట్టారు. అప్పటికే మైనింగ్ అధికారులు వస్తున్నారనే సమాచారం ఇసుక తోడేళ్లకు అందడంతో అందరూ పరారీ కాగా ఇసుక తవ్వుతున్న ఒక జేసీబీని పోలీసులు, మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. ఇప్పటి వరకు ఎంతమేర తవ్వారనేది మైనింగ్ అధికారులు అంచనాలు వేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో ఈ మూడు మండలాల పరిధిలో అవసరాలకు ఇసుక కొరత ఏర్పడుతుందనే అనుమానం కలుగుతుంది. వేటపాలెం, చినగంజాం మండలాల్లో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై కలెక్టర్ వెంకటమురళి సీరియస్‌గా దృష్టి సారించారు. సీఎం చంద్రబాబు చెప్పే ఉచిత ఇసుక విధానానికి స్థానికంగా జరిగే అక్రమాలకు పొంతన లేదు. ఇప్పటికైనా కలెక్టర్, ఎస్పీలు చొరవ తీసుకుంటేనే కొంతమేరైనా అక్రమార్కులకు కళ్లెం వేయవచ్చు.



రెవెన్యూ, పోలీసులు సీజ్ చేసిన జేసీబీ

బాధితులను అన్నివిధాలా ఆదుకుంటాం

జిల్లా కలెక్టర్ వెంకట మురళి

నిజాంపట్నం: నిజాంపట్నంలోని రాయల్ మెరైన్ సీ ఫుడ్ యూనిట్‌లో చోటుచేసుకున్న సంఘటనలో సుమారు 100 మంది వరకు అస్వస్తతకు గురయ్యారు. ఈ సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితులతో జిల్లా కలెక్టర్ వెంకట మురళీ మాట్లాడి జరిగిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ విలేకర్లతో మాట్లాడుతూ శనివారం ఉదయం 9 గంటలకు సీఫుడ్ యూనిట్‌లో నుంచి పొగ వస్తుండటంతో గమనించిన కార్మికులు రోజువారీ క్లీనింగ్‌లో భాగంగా వస్తున్న పొగగా భావించి యూనిట్ లోపలకు వెళ్లి పనులు చేసుకుంటుండగా అధికంగా వ్యాపించటంతో పలువురు అపస్మారక స్థితికి చేరుకున్నారన్నారు. వీరందరిని నిజాంపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యసేవలు అందించటం జరుగుతోందన్నారు. సుమారు 80 మంది వైద్యశాలలో చేరగా 53 మంది సాధారణ స్థితికి రావటం జరిగిందని, వీరిని డిశ్చార్జి చేసినట్లు తెలిపారు. 30 మందిని ప్రస్తుతం ఇన్ పేషంట్‌గా వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు. మరో ముగ్గురికి శ్వాస తీసుకోవటం ఇబ్బందిగా ఉండటంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు పంపించామని, పలువురు ప్రైవేటు వైద్యశాలకు వెళ్తామని కోరుతుండటంతో వారిని అక్కడకు పంపించి అయ్యే ఖర్చులు ప్రభుత్వమే భరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిజాంపట్నంలో వైద్యసేవలు పొందుతున్న వారికి ఇతర ప్రాంతాల నుంచి వైద్యులను పిలిపించి మెరుగైన వైద్యం అందించటంతో పాటు మందులు కొరత ఏమైనా ఉంటే వాటిని కూడా తెప్పించి వైద్యసేవలు అందిస్తామని చెప్పారు. ఫ్యాక్టరీలో చోటుచేసుకున్న సంఘటనపై పొల్యూషన్ బోర్డు సభ్యులు విచారణ చేపట్టేవిధంగా ఆదేశించటం జరిగిందన్నారు. పూర్తి వివరాలు సేకరించి సంఘటన ఏ విధంగా చోటుచేసుకుందే అనే అంశంపై వివరాలు సేకరించటం జరుగుతుందన్నారు. యాజమాన్యం లోపమేమైనా ఉంటే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట ఆర్డీవో నేలపు రామలక్ష్మి, తహసీల్దార్ షాకీర్ పాషా తదితరులున్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకట మురళి

ఉపాధి హామీతో పేదలకు జీవనోపాధి కల్పించాలి

- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి
- డీఈఓ, చీరాల మున్సిపల్ కమిషనర్‌లకు చార్జి మెమోలు

బాపట్ల: ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన ప్రతి పేదవానికి జీవనోపాధి కల్పించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశం ఈనెల 5వ తేదీన ఉన్నందున ముందస్తుగా జిల్లా అధికారులతో శనివారం స్థానిక కలెక్టర్ కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ పథకం అనుసంధానంతో బాపట్ల జిల్లాలోని తీర ప్రాంతాలన్నిటిలో విస్తృతంగా మొక్కలు నాటి ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలపాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. పచ్చదనం, పరిశుభ్రత పాటించేలా డ్వామా, అటవీ, పంచాయతీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా ఈ కార్యక్రమం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు అన్ని ప్రాంతాలకు సమంగా ఉండేలా చూడాలన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. జిల్లాలో పంట కాల్వల మరమ్మతులకు మంజూరైన పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. కెడబ్ల్యూడి, ఎస్ఎస్‌పీ కింద జిల్లాకు మంజూరైన రూ.14 కోట్లతో పనులు ప్రారంభించాలన్నారు. జిల్లాకు 50,415 గృహాలు మంజూరు కాగా, 16,362 గృహాలు పూర్తయ్యాయన్నారు. వంద రోజుల్లో 3,064 గృహాలను డిసెంబర్ నెలాఖరికి పూర్తి చేయాలని లక్ష్యంగా పనులు చేయాలన్నారు. 19,790 ఎన్టీఆర్ గృహాల లబ్ధిదారులకు నిలిచిన నిధులను ఇవ్వడానికి సర్వే ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలన్నారు. టిడ్కో గృహాల నిర్మాణంపై సమగ్ర ప్రణాళికలు రూపొందించి నివేదించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్నింటిలోని ప్రతి ఇంటికి తాగునీటిని పుష్కలంగా సరఫరా చేయాలని తెలిపారు. 14,603 మరుగుదొడ్లు నిర్మించాలని లక్ష్యం కాగా, ప్రస్తుతం 4,433 మరుగుదొడ్లు నిర్మించడంపై ఆరా తీశారు. సత్వరమే ఈ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం కింద మంజూరైన రూ.42.8 కోట్ల నిధులతో 1,197 పనులు ప్రారంభించాలన్నారు. గ్రామ పంచాయతీలలో చెత్త సంపద కేంద్రాలు పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరం చేపట్టాలన్నారు. అన్న క్యాంటీన్‌లు సమర్థంగా నిర్వహించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి, చీరాల మున్సిపల్ కమిషనర్ గైర్హాజరుపై చార్జి మెమో ఇవ్వాలని ఆదేశించారు. సీపీఓ శ్రీనివాసరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు నివారణకు చర్యలు

రహదారులపై ప్రమాదాలను నివారించడానికి గుంతల రహిత కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఏపీ కార్యక్రమంలో భాగంగా బాపట్ల మండలం ఈతేరు వద్ద గుంతలు పూడ్చి రహదారి మరమ్మతు చేసే పనులను జిల్లా కలెక్టర్ శనివారం ప్రారంభించారు. రహదారులపై సుఖ ప్రయాణం జరగాలని, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని కలెక్టర్ చెప్పారు. ఇందు కోసం జిల్లాలో 319 కిలోమీటర్ల మేర రహదారులకు గుంతలు పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నట్లు వివరించారు. మరమ్మతుల కోసం బాపట్ల జిల్లాకు రూ.16 కోట్లు నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. బాపట్ల నియోజకవర్గంలోని రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం రూ.3.24 కోట్ల నిధులను విడుదల చేసిందన్నారు. గుంటూరు–చీరాల రహదారి ఈతేరు నుంచి నాగరాజు కాల్వ వరకు 9 కిలోమీటర్ల పొడవున గుంతల పూడ్చి, తాత్కాలిక మరమ్మతులు చేయడానికి రూ.23 లక్షలతో పనులు చేస్తున్నామన్నారు. ఆర్డీఓ గ్లోరియ, ఆర్ అండ్ బీ ఈఇ గీతారాణి, డి అరుణ, తహసీల్దార్ ఉన్నారు.

సూర్యలంక తీరానికి కార్తిక శోభ

- ప్రారంభం అయిన కార్తిక మాసం
- శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన మహిళలు
- తెల్లవారుజామునే తీరంలో పుణ్యస్నానాలాచరించిన భక్తులు

బాపట్లటౌన్: కార్తికమాసం ప్రారంభం కావటంతో భక్తులు శైవక్షేత్రాలను దర్శించుకున్నారు. ముఖ్యంగా మహిళలు తెల్లవారుజామునే సూర్యలంక తీరానికి చేరుకొని తీరంలో పుణ్యస్నానాలుచేసి తీరం ఒడ్డున పసుపు, కుంకుమ, ఐదు రకాల పూలు, పండ్లతో గౌరిదేవి పూజలు నిర్వహించారు. గౌరీదేవి ప్రతిమలను సూర్యలంక తీరంలో కలిపి సూర్యనమస్కారాలతో కూడిన స్నానాలు ఆచరించారు. స్నానాల అనంతరం తీరం వెంబడి ఉన్నటువంటి తారకేశ్వరస్వామి దేవాలయం, ప్రసన్నాంజనేయస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తులతో పోటెత్తిన శివాలయాలు

బాపట్ల పట్టణంలో వేంచేసియున్న సోమేశ్వర స్వామి ఆలయానికి భక్తులు శనివారం తెల్లవారుజామున పోటెత్తారు. పుణ్య స్నానాలనంతరం అధిక సంఖ్యలో మహిళలు సోమేశ్వరస్వామి ఆలయానికి చేరుకొని స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. తెల్లవారుజామున నాలుగు నుంచి ఆరు గంటల వరకు స్వామివారికి విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి భారీసంఖ్యలో చేరుకున్న మహిళలు ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చన, గౌరీదేవి పూజలు, పుష్పార్చన కార్యక్రమాలను కనుల పండుగగా నిర్వహించారు. పట్టణంలోని ఎస్ఎన్‌పీ అగ్రహారంలోని గంగా పర్వతవర్ధనీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి, త్యాగరాయనగర్‌లోని శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి, మండలంలోని వెదుళ్లపల్లిలో గంగా పార్వతి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి, అప్పికట్లలోని అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.



సూర్యలంకలో సముద్రస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మద్యం సిండికేట్లతో పేదల జీవితం ఛిద్రం

– సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రమాదేవి



చీరాల: రాష్ట్రంలో సిండికేట్లు మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని, దీంతో పేదల జీవితాలు ఛిద్రమవుతాయని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డి.రమాదేవి అన్నారు. శనివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సీపీఎం చీరాల ప్రాంతీయ మహాసభలో మాట్లాడారు. మద్యం మత్తులో అనేక చోట్ల మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్నారన్నారు. మద్యం నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. విచ్చలవిడిగా మద్యం విక్రయాలపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల ఓటు హక్కును కాజేసేందుకు ప్రధాని మోదీ జమిలి ఎన్నికలు తీసుకువచ్చి పెత్తనం చేయాలని చూస్తున్నారన్నారు. మోదీ నియంతృత్వ పోకడకు టీడీపీ, జనసేన కూడా మద్దతు ఇస్తున్నాయన్నారు. ఇదే జరిగితే ఉద్యోగ, జీవిత భద్రత లేకుండా పోతుందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య మాట్లాడుతూ బాపట్ల జిల్లాకు పరిశ్రమలను తీసుకురావాలని.. జిల్లాలో పీజీ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. చీరాల పట్టణంలో ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని సీపీఎం చీరాల కార్యదర్శి ఎస్.బాబూరావు కోరారు. చేనేత నిల్వలను ప్రభుత్వం కొనుగోలు చేసి చేనేత వృత్తిలో ఉపాధి కల్పించాలన్నారు. సీపీఎం జిల్లా నాయకులు సీహెచ్ మజుందార్, ప్రజానాట్యమండలి కళాకారులు పి.కిరణ్, ఎం.సత్యమూర్తి, ఎం.అయ్యప్పరెడ్డి గీతాలాపన చేశారు. సీపీఎం నాయకులు ఎం.వసంతరావు, ఎల్.జయరాజు, పి.కొండయ్య, డి.నారపరెడ్డి, బి.హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

త్రికోటేశ్వరునికి విశేష అభిషేకాలు

నరసరావుపేట రూరల్: పవిత్ర కార్తిక మాసం తొలిరోజున కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అభిషేకాల్లో పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. శనివారం తెల్లవారుజాము నుంచి ఆలయంలో భక్తుల తాకిడి నెలకొంది. అయ్యప్పమాలధారులు తొలిపూజలో పాల్గొన్నారు. ఆలయం వెనుక ఉన్న రావిచెట్టు వద్ద మహిళలు కార్తిక దీపాలు వెలిగించి పూజలు జరిపారు. ధ్యానశివుడు, నాగేంద్రుడి పుట్ట, మహానందీశ్వరుడు విగ్రహాల వద్ద భక్తులు పూజలు నిర్వహించారు.

క్లుప్తంగా

ఆటో ఢీకొని చిన్నారి మృతి



బాపట్లటౌన్: ఆటో ఢీకొని ఎనిమిది నెలల బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని జమ్ములపాలెంలో చోటుచేసుకుంది. వివరాలు.. పట్టణంలోని బెస్ట్ చైల్డ్ స్కూల్‌కు చెందిన ఆటో విద్యార్థులను పాఠశాలకు తీసుకొచ్చేందుకు శనివారం ఉదయం గ్రామానికి వెళ్లింది. అదే సమయంలో మోచర్ల ప్రకాష్‌బాబు(8 నెలలు) మేనత్త చిన్నారిని నడిపిస్తూ రోడ్డుపైకి వచ్చింది. ఆటో అతివేగంగా వెళ్లడంతో ప్రకాష్‌బాబు ఆటోకిందపడి అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడు తండ్రి శేఖర్, తల్లి సౌమ్యసుసన్న దంపతులకు ప్రకాష్ ఒక్కరే సంతానం. రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆటో సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. చిన్నారి మృతి చెందిన విషయం తెలుసుకున్న జమ్ములపాలెం గ్రామస్తులు అధికసంఖ్యలో ఏరియా వైద్యశాలకు చేరుకున్నారు.

రైలు ప్రమాదంలో వృద్ధుడు మృతి



చీరాలరూరల్: రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన శనివారం చీరాలలో చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య తెలిపిన వివరాల మేరకు.. స్థానిక కారంచేడు రైల్వేగేటు సమీపంలో రైలు పట్టాల పక్కన కాలకృత్యాలు తీర్చుకుంటున్న వృద్ధుడికి ప్రమాదవశాత్తూ రైలుబండి తగలడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎవరికైనా ఆచూకీ తెలిసినట్లయితే జీఆర్పీ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

నేడు 'యశస్వి' అవార్డు ప్రదానోత్సవం

గుంటూరు వెస్ట్: 'యశస్వి' సర్రాజు శ్రీవేణుగోపాలరావు స్మారక ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల పురస్కార ప్రదాన కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం 6 గంటలకు స్థానిక లక్ష్మీపురంలోని త్యాగరాజ సాంస్కృతిక సంఘంలో నిర్వహిస్తామని సంస్కృతి సంస్థ వ్యవస్థాపకులు సర్రాజు బాలచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయునిగా, కవిగా, గాయకునిగా విభిన్న పాత్రలను విజయవంతంగా నిర్వహించిన శ్రీవేణుగోపాలరావు ఎందరికో ఆదర్శనీయమన్నారు. ప్రస్తుతం ఆయన శిష్యులు దేశ, విదేశాల్లో ఉన్నత స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా రుద్రవరం జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు ఉన్నం జ్యోతివాసు, కవి, గాయకుడు, గేయ రచయిత, తెలుగు పండితుడు ఖమ్మం జిల్లా గోళ్ళపాడు జెడ్పీ హెచ్‌ఎస్ అసిస్టెంట్ మేడగాని శేషగిరిరావులకు సంగీత, సాహిత్య, నృత్య, నాటక సంస్థ సంస్కృతి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. విశిష్ట అతిథులుగా కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, లేమల్లెపాడు ఎంటీఎస్ ఉపాధ్యాయుడు మోదుగుల రవికృష్ణతోపాటు అనేక మంది వక్తలు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రవేశం ఉచితమని వివరించారు.

విద్యార్థులపై హాస్టల్ కమాటీ దాష్టీకం

- ఇద్దరు బాలలను విచక్షణారహితంగా రక్తమొచ్చేలా కొట్టిన వైనం
- ఒకరికి తలపై గాయాలు, మరొకరికి నడుముకు తీవ్ర గాయాలు
- కేకలు వేస్తూ బోరున విలపించిన చిన్నారులు



నడవలేని స్థితిలో ఉన్న మోహన్ ఆదిత్యను ఆస్పత్రికి భుజాలపై మోసుకెళుతున్న బంధువులు



తీవ్ర భయాందోళనతో వెక్కివెక్కి ఏడుస్తున్న విద్యార్థులు, తల్లి

ప్రత్తిపాడు: ఓ హాస్టల్ కమాటీ విచక్షణ మరిచాడు. కర్కశంగా ప్రవర్తిస్తూ విద్యార్థులపై పాశవికంగా దాడికి పాల్పడ్డాడు. విద్యార్థుల కాళ్లు పట్టుకుని నేలకేసి కొట్టి పైశాచికంగా ప్రవర్తించాడు. రక్తగాయాలతో భయాందోళనకు గురైన విద్యార్థులు పెద్ద పెద్దగా కేకలు వేస్తూ పరిగెత్తడంతో స్థానికులు గమనించి విద్యార్థులను కమాటీ దాడి నుంచి రక్షించి బయటకు తీసుకు వచ్చిన ఘటన పెదనందిపాడులో జరిగింది. పల్నాడు జిల్లా అమరావతికి చెందిన గోవింద నాగార్జున, లక్ష్మీ అన్నపూర్ణ దంపతుల ఇద్దరు కుమారులు జి.జ్యోతి రాజేష్, మోహన్ ఆదిత్యలను పెదనందిపాడు ఎస్సీ బాలుర వసతి గృహంలో చేర్పించారు. అక్కడే ఉంటూ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇద్దరు బాలురు ఐదవ తరగతి చదువుకుంటున్నారు. దీపావళి సెలవులు కావడంతో ఇటీవల పిల్లలిద్దరూ ఇంటికివెళ్లారు. సెలవుల అనంతరం స్కూల్‌కు వెళ్లనని పిల్లలు మారాం చేయడంతో వారికి నచ్చజెప్పి శనివారం ఉదయం తల్లి అన్నపూర్ణ పిల్లలను తీసుకుని హైస్కూల్ వద్దకు వచ్చారు. ఆ సమయంలో అక్కడే ఉన్న హాస్టల్ కమాటీ షేక్ అబ్దుల్ వహాబ్‌కు ఇంటివద్ద జరిగిన విషయం చెప్పి, పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని కోరి ఇంటికి బయల్దేరారు.

విచక్షణారహితంగా..

ఇదే అదనుగా కమాటీ రెచ్చిపోయాడు. పాఠశాల ఆవరణలోనే విచక్షణారక్షితంగా విద్యార్థులపై దాడికి పాల్పడ్డాడు. జ్యోతిరాజేష్‌ను తలపట్టుకుని గోడకేసి కొట్టడంతో బాలుడి తలకు తీవ్ర రక్త గాయమైంది. భయాందోళనకు గురైన విద్యార్థి పరుగులు పెట్టాడు. మోహన్ ఆదిత్యనూ రెండు కాళ్లూ పట్టుకుని మెట్లుకేసి గట్టిగా కొట్టాడు. దీంతో అతని నడుముకు తీవ్ర గాయాలై నడవలేని, నిలబడలేని పరిస్థితి నెలకొంది. విద్యార్థులిద్దరూ పెద్ద పెద్దగా కేకలు వేశారు. గమనించిన స్థానికులు పిల్లలను అలా దారుణంగా ఎందుకు కొడుతున్నారని కమాటీని ప్రశ్నించడంతో అతని నుంచి సమాధానం కరువైంది. సమాచారం అందుకున్న తల్లి, కుటుంబ సభ్యులు వెనక్కు వచ్చి రక్తమోడుతున్న కుమారుడితోపాటు, నడవలేక నిస్సహాయ స్థితిలో ఉన్న కుమారుడిని చూసి నెత్తీనోరూ బాదుకుని కన్నీటి పర్యంతమయ్యారు. స్థానికులు చిన్నారులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. నడవలేని స్థితిలో ఉన్న విద్యార్థిని భుజాలపై ఎత్తుకుని బంధువులు ఆస్పత్రికి తీసుకుని వెళ్లారు. సమాచారం అందుకున్న పెదనందిపాడు ఎస్‌ఐ మధుపవన్ ఆస్పత్రికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. వారి నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కమాటీని అదుపులోకి తీసుకున్నారు. అయితే సంబంధిత శాఖ అధికారులు కమాటీని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది.

'వివా' విద్యార్థుల ఆవిష్కరణలు విజయవంతం



నంబూరు వీవీఐటీలో విద్యార్థులతో అతిథులు విశ్రాంత డీజీపీ మాలకొండయ్య, లావు నాగేశ్వరరావు, చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్‌లతో అధ్యాపకులు, విద్యార్థులు



నంబూరు వీవీఐటీలో ఆవిష్కరణను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పెదకాకాని: ఆలోచన, పరిజ్ఞానాన్ని పంచుకుంటూ సృజనాత్మకతకు సాంకేతిక మేళవింపుతో వివా విద్యార్థులు జర్మనీ విద్యార్థులతో కలసి రూపొందించిన నూతన ఆవిష్కరణలను వివా పాఠశాల వేదికగా శనివారం విజయవంతంగా ప్రదర్శించారు. పెదకాకాని మండలంలోని నంబూరు వీవీఐటీలో మేక్‌థాన్ -2024లో భాగంగా జర్మనీకి చెందిన ఓం విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ బెర్నార్డ్ ఆధ్వర్యంలో వివా పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు, జర్మనీ న్యూరెంబర్గ్ నగరానికి చెందిన డ్యూరర్, మార్టిన్ బెహం పాఠశాలలకు చెందిన 13 మంది విద్యార్థులు మూడు బృందాలుగా ఏర్పడి రూపొందించిన మూడు ఆవిష్కరణలు బ్లైండ్ స్టిక్ (కళ్లులేని వారిని రహదారులపై అప్రమత్తం చేసే చేతికర్ర), ఎకో మోషన్ షూస్, (పల్స్ పెడల్), నాడీ వేగాన్ని అదుపులో ఉంచే సైకిల్ పెడల్‌లను ముఖ్యఅతిథులు మాజీ డీజీపీ మాలకొండయ్య, ప్రముఖ పారిశ్రామికవేత్త లావు నాగేశ్వరరావు, వివా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకుల సమక్షంలో ప్రదర్శించారు. మాజీ డీజీపీ మాలకొండయ్య మాట్లాడుతూ ప్రాజెక్ట్ ఆధారిత విద్య అనేది విద్యార్థులకు చాలా అవసరమన్నారు. దీని ద్వారా విద్యార్థులు వాస్తవిక ప్రపంచాన్ని అధ్యయనం చేయగలుగుతారన్నారు. మేక్‌థాన్‌లో పాల్గొన్న విద్యార్థులను, సహకరించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను అభినందించారు. లావు నాగేశ్వరరావు మాట్లడుతూ సృజనాత్మకత, నైపుణ్యాభివృద్ధికి ఇటువంటి మేక్‌థాన్‌లు ఉపయోగపడుతాయన్నారు.

ప్రొఫెసర్ డాక్టర్ బెర్నార్డ్ మాట్లాడుతూ ఒకే ప్రాంగణంలో కళాశాల, పాఠశాల ఉండటం ద్వారా ఈ మేక్‌థాన్‌లో సాంకేతిక అంశాలలో పరిష్కారాలను సులువుగా సాధించగలిగామన్నారు. గత 6 నెలలుగా విద్యార్థులు ఈ ఆవిష్కరణలకు కృషి చేస్తున్నారన్నారు. చివరిగా ప్రాజెక్ట్ విజయవంతం కావడం సంతోషం కలిగించిందని తెలిపారు. మూడు దశలలో జరిగిన ఈ మేక్‌థాన్‌లో మొదటి దశ అంతర్జాలం ద్వారా నిర్వహించగా ఈ దశలో విద్యార్థులు వారి ఆలోచనలను పంచుకొని మూడు ఆవిష్కరణలను ఎంచుకొన్నారని చెప్పారు. రెండవ దశలో వివా విద్యార్థులు జర్మనీలో నిర్వహించిన మేక్‌థాన్‌లో పాల్గొని ఆవిష్కరణల రూపకల్పనకు శ్రీకారం చుట్టారని, మూడవ దశలో భాగంగా జర్మన్ విద్యార్థులు వివా పాఠశాలలో నిర్వహించిన మేక్‌థాన్‌కు హాజరై విజయవంతంగా ఆవిష్కరణలను రూపొందించారని వివరించారు. కార్యక్రమంలో చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, డైరెక్టర్ ఎల్ కమాండర్ కేఎస్ రావు, ఉపాధ్యాయులు ఏకే మాధవి, వై.ప్రసాదరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం మన సంస్కృతి

జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు



నామని రోశయ్య మల్టీలేయర్ మోడల్ పొలంలో క్షేత్రసందర్శన

తెనాలి: ప్రకృతి వ్యవసాయం మన సంస్కృతి అని, దీనిని కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు చెప్పారు. జిల్లాలోని వ్యవసాయ, ఉద్యానవన అధికారులకు ప్రకృతి వ్యవసాయంపై సమన్వయ/అవగాహన కార్యక్రమాన్ని శనివారం కొల్లిపర మండలం అత్తోటలోని భూమిభారతి వద్ద నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయం చాలా అవసరమని, రైతులందరూ దీనిపై దృష్టి సారించాలని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.రాజ కుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలోని తొమ్మిది సార్వత్రిక సూత్రాలను వివరించారు. భూమి భారతి వ్యవస్థాపకులు యద్రు బాపయ్య తన ప్రకృతి వ్యవసాయ ప్రయాణాన్ని, అనుభవాలను అధికారులకు వివరించారు. తన పొలం లో పండిస్తున్న దేశీ వరి విత్తనాల గురించి, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి తెలియజేశారు. అనంతరం అధికారులందరికీ పొలాల్లోని ఏ-గ్రేడ్ ఎంటీఎం విధానం పొలం, నామని రోశయ్య సాగుచేస్తున్న మల్టీలేయర్ మోడల్ క్షేత్రాలను చూపించారు. ఆత్మ పీడీ వెంకటేశ్వర్లు, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సునీత, ఉద్యానశాఖ అధికారిణి జానకి, తెనాలి, గుంటూరు, పొన్నూరు, మంగళగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు, జిల్లాలోని 17 మండలాల వ్యవసాయ అధికారులు, ఉద్యానశాఖ అధికారులు, కేఎల్ విశ్వవిద్యాలయం వ్యవసాయ విద్యార్థులు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది హాజరయ్యారు. అనంతరం ప్రకృతి సేద్యం కోసం కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేయించారు.

సరికొత్త భావధారలతో పరిపుష్టి

సాహితీవేత్త వేణుగోపాల్



సాహితీవేత్త ఎస్.వేణుగోపాల్‌కు జ్ఞాపికను అందిస్తున్న నిర్వాహకులు

బాపట్ల: ఆధునిక సాహిత్యం పురుడు పోసుకున్నది మొదలు నేటి వరకు అనేక సరికొత్త భావ ధారలతో పరిపుష్టి చెందుతోందని, ఇప్పటికీ సుస్థిరత - సమగ్రత సాధించే దిశగానే కొనసాగుతోందని ప్రముఖ సాహితీ వేత్త ఎస్. వేణు గోపాల్ అన్నారు. నెలనెలా నందివర్ధనం తరతరాల తెలుగు పలుకు 93వ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరయ్యారు. 'వచన కవిత్వం - ఆధునిక - ఆధునికానంతర పోకడలు' అన్న అంశంపై తన విహంగ వీక్షణ ప్రసంగాన్ని అత్యద్భుతంగా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎస్.వేణుగోపాల్ మాట్లాడుతూ .. తొలుత 'ఆధునికత' అనే భావజాలం గురించి పరిచయం చేశారు. ఆధునికత అనేది ఎప్పటికప్పుడు సరికొత్తగా కనిపించినా, అనాదిగా అనేక రూపాల్లో తన విశిష్టతను, ప్రాముఖ్యతను నిరంతరతను కొనసాగిస్తూనే ఉన్నదన్నారు. సాహిత్యంలో కూడా ఇదే తరహాలో అనేక ఆధునిక పోకడలు ఆదికవి నన్నయ నాటి నుంచే మొదలైనప్పటికీ స్వతంత్రత లేని కారణంగా, ఉన్నత వర్గాలకు మాత్రమే పరిమితం అయిన కారణంగా, రాజాశ్రయం ఒక్కటే సాహిత్యానికి చిరునామాగా మిగిలిన కారణంగా పరిమితమైన సాహిత్యమే బయటకి వ్యక్తపరచబడి, అదే నేటికీ ప్రదర్శనలో మిగిలిందన్నారు. సమాజం ఆయా రంగాల్లో పరిఢవిల్లుతున్న తీరుగా ఆధునికత సాహిత్యంలో సుస్థిరం చెందిన దాఖలాలు ప్రపంచంలో ఎక్కడా లేవన్నారు. కార్యక్రమంలో వివేక సర్వీస్ సొసైటీ అధ్యక్షులు ఎస్.వి.వి. నాగరాజు, కార్యదర్శి అంబటి మురళీ కృష్ణ, ధృతి కార్యదర్శి చాపల సుబ్రహ్మణ్యం, కన్వీనర్ పి.శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడిగా సుమన్



మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు సుమన్

పర్చూరు(చినగంజాం): హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడిగా పర్చూరుకు చెందిన లక్కిపోగు సుమన్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం పర్చూరులో ప్రారంభించిన నూతన కార్యాలయంలో ఆయన బాధ్యతలను చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జాతీయ అధ్యక్షుడు చెన్నుపాటి శ్రీకాంత్ మాట్లాడుతూ అవినీతి రహిత సమాజ స్థాపనే హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ముఖ్య ఉద్దేశమన్నారు. దేశంలో ఉన్న అన్ని రంగాలు అవినీతిలో కూరుకుపోయాయని తెలిపారు. వాటిని ప్రక్షాళన చేసి నిజాయితీగా ఉద్యోగ ధర్మం నిర్వర్తించే వారికి కౌన్సిల్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. ఎక్కడ అవినీతి జరిగినా మా దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కౌన్సిల్ జాతీయ ప్రధాన కార్యదర్శి నందం నరసింహారావు, ఏపీ అధ్యక్షుడు జెర్రిపోతుల నానాజీ, ఉపాధ్యక్షుడు జి.రాంబాబు, సౌత్ ఇండియా మహిళా అధ్యక్షురాలు జయలక్ష్మి, లీగల్ కార్యదర్శి రాజ్యలక్ష్మి, జిల్లా మీడియా ఇన్‌చార్జి వీరభద్రం, విశ్రాంత ఎస్సీ లక్కిపోగు డేవిడ్ పాల్గొన్నారు.

బారక్ పూర్ తిరుగుబాటు అజరామరం



మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమశాఖ డెప్యూటీ డైరెక్టర్ రాజ్ దెబోరా

బాపట్ల: ఆంగ్లేయుల ఆరాచకాలకు వ్యతిరేకంగా దేశంలో జరిగిన మొట్టమొదటి పోరాటం 'బారక్ పూర్ తిరుగుబాటు' అని సాంఘిక సంక్షేమ శాఖ డెప్యూటీ డైరెక్టర్ రాజ్ దెబోరా పేర్కొన్నారు. ఇది భారత స్వాతంత్రోద్యమ పోరాటంలో మహోజ్వల ఘట్టం. ఈ తిరుగుబాటే ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి నాందీ ప్రస్తావనగా నిలిచిందని ఆమె పేర్కొన్నారు. బారక్ పూర్ తిరుగుబాటు ద్విశతాబ్ది ఉత్సవాలు శనివారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ఆహార శాస్త్ర సాంకేతిక కళాశాలలో నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్ బేగ్ అధ్యక్షత వహించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, అధ్యాపకులు డాక్టరు సోమశేఖరరావు, డాక్టర్ గౌతమి, డాక్టర్ బ్లెస్సి సాగర్, వంకాయలపాటి హరిబాబు, భార్గవ్, చినభూషణం, సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

పింఛన్ సొమ్ముతో వెల్ఫేర్ అసిస్టెంట్ ఉడాయింపు

ఈపూరు: మండలంలోని బొమ్మరాజుపల్లి గ్రామ సచివాలయం పరిధిలో వెల్ఫేర్ అసిస్టెంట్ పింఛన్ సొమ్ముతో పరారయ్యాడు. సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బాణావత్ గోవర్ధన్ నాయక్ 39 మంది పింఛన్ దారులకు సంబంధించిన పింఛన్ సొమ్ము రూ.1.76లక్షలు పంపిణీ చేయకుండా పారిపోయాడు. మండల అధికారులు వెల్ఫేర్ అసిస్టెంట్ కోసం ఎంత ప్రయత్నించినప్పటికీ అందుబాటులో లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు.